అదిగో.. యోగనరసింహుడు



సింహ వాహనంపై యోగ నరసింహుడిగా వస్తున్నాడదిగో గోవిందుడు.. అంటూ భక్తులు తన్మయంతో మలయప్పను దర్శించుకున్నారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం ఉదయం సింహవాహనంపై ఊరేగుతూ స్వామివారు భక్తులనుఅనుగ్రహించారు. ఇక, రాత్రి ముత్యపుపందిరిలో బకాసురవధ అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్ప మాడవీధుల్లో ఊరేగారు. వాహన సేవల ముందు కళారూపాలు అబ్బురపరిచాయి. భక్తులు అధికంగా పాల్గొని ఉత్సవర్లను దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





మట్టిపాములు

గూడూరు ప్రాంతంలో జోరు పెంచిన గ్రావెల్ మాఫియా



తవ్వి తెచ్చిన మట్టితో గోగినేనిపురం వద్ద రియల్ వెంచర్లకు షోకులు



తిప్పవరప్పాడు క్రాస్ వద్ద లేఅవుట్‌ను అక్రమంగా తరలించిన మట్టితో నింపుతున్న దృశ్యం

తిరుపతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా పరిస్థితులు మారలేదు. ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలూ, తరలింపులూ యథేచ్ఛగా సాగుతూనే ఉన్నాయి. గూడూరు ప్రాంతంలో గ్రావెల్ మాఫియా మరింతగా చెలరేగిపోతోంది. గూడూరు మండలం చెన్నూరు పెద్ద చెరువులోని మట్టిని తవ్వితీసి చెన్నూరు, తిప్పవరప్పాడు, గోగినేనిపురంలోని లేఅవుట్లకు తరలిస్తున్నారు. అలాగే చిల్లకూరు మండలంలోని తొణుకుమాల, పొన్నవోలు, రెట్టపల్లి ప్రాంతాల్లోని ఇరిగేషన్ చెరువులు, ప్రభుత్వ భూముల్లోనూ గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ మట్టిని జాతీయ రహదారుల విస్తరణ పనులకు, తహసీల్దారు కార్యాలయం ఆనుకుని వేసిన లేఅవుట్‌కు, రైటర్‌సత్రం, వరగలి క్రాస్ రోడ్డు వద్ద లేఔట్లకు అక్రమంగా వాడుతున్నారు. ఇవేవీ అనుమతులున్న తవ్వకాలు కాదు. ఎక్స్‌కవేటర్లతో తవ్వి, పట్టపగలే భారీ టిప్పర్లు, లారీలతో తరలిస్తున్నారు. మైనింగ్, విజిలెన్స్, ఇరిగేషన్, రెవెన్యూశాఖ అధికారులకు ఈ అక్రమ గ్రావెల్ తవ్వకాలు కనిపించకపోవడం విశేషం. గతంలో వైసీపీ నాయకులు దండుకుంటే, ఇప్పుడు కూటమి పెద్దలు పిండుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇందులో గూడూరు రూరల్‌లోని ఓ మహిళా నేత భర్త, పట్టణంలోని మైనార్టీ నేత, మరో మండలస్థాయి నేత పాత్ర ఉందనే ప్రచారం ఉంది. చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం, తొణుకుమాల, పొన్నవోలుకు చెందిన నేతల సమన్వయంతో గ్రావెల్ తరలిస్తున్నట్లు చెబుతున్నారు. టిప్పర్‌కైతే ఇంత.. ట్రాక్టర్‌కైతే ఇంత అని రేట్లు ఖరారు చేసి మరీ వసూళ్లు చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే తక్కువ కాలంలోనే కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉంది.



చెన్నూరు చెరువులో భారీ ఎత్తున మట్టిని తవ్వుతున్న ఎక్స్‌కవేటర్లు

జీలపాటూరు నుంచి వైద్యవిద్యలోకి మరో ముగ్గురు

- 'నీట్'లో సత్తా చాటిన రైతు బిడ్డలు



కడూరు మునిసాకేత్



కలివిలి మోక్షజ్ఞ

పెళ్లకూరు, అక్టోబరు 6: సరస్వతీ నిలయంగా పేరొందిన పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామం నుంచి మరో ముగ్గురు విద్యార్థులు వైద్యవిద్యలో ప్రవేశం పొందారు. ఇప్పటికే జీలపాటూరు గ్రామం నుంచి 25 మంది వైద్య వృత్తిలో, వైద్యవిద్యలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన చిన్నకారు రైతులు కడూరు మునిశేఖర్, మునిరత్నం దంపతుల కుమారుడు మునిసాకేత్ (651 మార్కులు), కలివిలి మస్తాన్, సులోచన దంపతుల కుమారుడు మోక్షజ్ఞ (613), సురేంద్ర, గీత దంపతుల కుమారుడు భానప్రకాశ్ (593) నీట్-2024 ఫలితాలలో సత్తా చాటారు. వీరిలో మునిసాకేత్ కర్నూలు మెడికల్ కాలేజీ, మోక్షజ్ఞ తమిళనాడులోని కిలిపాకం మెడికల్ కాలేజీ, భానుప్రకాశ్ కడప రిమ్స్ మెడికల్ కాలేజీలో సీట్లు దక్కించుకున్నారు. ఇలా వైద్యవృత్తిలో ఈ కుగ్రామం నుంచి ఏటా సీట్లు దక్కించుకుంటూ ఉండటం విశేషం. వైద్యవిద్య, వైద్యవృత్తిలోనే కాకుండా ఇంజనీర్లుగా, న్యాయవాదులుగా, ఉపాధ్యాయులుగా, బ్యాంకు ఉద్యోగులుగా, పోలీస్‌లుగా మరో 70 మందికి పైగా ఉన్నత విద్యను అభ్యసించి దేశవిదేశాలలో స్థిరపడ్డారు. అందుకే జీలపాటూరును సరస్వతీ నిలయంగా పలువురు ప్రశంసిస్తున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా పరిష్కార వేదిక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు6: కలెక్టరేట్‌లో సోమవారం 'మీ కోసం- ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను(సీజీఆర్ఎస్) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు. డివిజన్, మండల, సచివాలయ స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనూ సంబంధిత అధికారులు విధిగా హాజరు కావాలని స్పష్టంచేశారు.

ఆర్థిక విభేదాల వల్లే అస్పియాను చంపేశారు

- ముగ్గురు నిందితుల అరెస్టు



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, వైద్యాధికారి

పుంగనూరు, అక్టోబరు 6: చిత్తూరు జిల్లా పుంగనూరులో ఆరేళ్ల చిన్నారి అస్పియాను ఆర్థిక లావాదేవీల్లో వచ్చిన విభేదాల వల్లే కక్షతో చంపేశారని ఎస్పీ మణికంఠ తెలిపారు. ఆదివారం పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదనాచారితో కలిసి మీడియాతో మాట్లాడారు. 'ఉబేదుల్లా కాంపౌండ్‌లో ఉంటున్న ఫైనాన్స్ వ్యాపారి అజ్మతుల్లా వద్ద ఓ మహిళ రూ.3.50 లక్షలు అప్పుగా తీసుకుని సక్రమంగా ఇవ్వలేదు. దీనిపై అతడు గట్టిగా నిలదీయడం, కేసు వేస్తానని బెదిరించడంతో ఆ మహిళ కక్ష పెంచుకుంది. అజ్మతుల్లా ఇంటికి సమీపంలోని తన తల్లికి విషయం చెప్పింది. గత నెల 29వ తేదీ రాత్రి 7.30 గంటల సమయంలో ఇంటి ముందు పిల్లలతో కలిసి అజ్మతుల్లా కుమార్తె అస్పియా(6) ఆడుకుంటుండగా.. కరెంటు పోయింది. ఆ సమయంలో బురఖాలో ఓ ముస్లిం మహిళ, తనకు సోదరుడి వరుసయ్యే మరో 17 ఏళ్ల బాలుడు అస్పియాకు చాక్లెట్ ఇచ్చారు. మరిన్ని ఇస్తామంటూ వంద మీటర్ల దూరంలోని ఇంటికి తీసుకెళ్లారు. బాలికకు భోజనం పెట్టారు. బాలుడు ఇంటిముందు కాపలా ఉండగా.. అజ్మతుల్లాపై ఉన్న కోపంతో అస్పియాను ఆ మహిళ ఊపిరి ఆడకుండా చేసింది. ఈ పెనుగులాటలో హంతకురాలి చేతిపై చిన్నారి గాజు కూడా గుచ్చుకుని గాయమైంది. చిన్నారి చనిపోగానే నేరం తమపై రాకుండా మహిళ, బాలుడు కలిసి బైక్‌పై మృతదేహాన్ని తీసుకెళ్లి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో పడేశార'ని ఎస్పీ వివరించారు. బాలిక అదృశ్యం, హత్య ఘటనలో ఆధారాలు లేకుండా.. విలువలు పాటించకుండా మీడియా నిరాధార కథనాలు ఇవ్వడం మంచిదికాదని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బాలికపై ఎలాంటి అత్యాచార ప్రయత్నం జరగలేదంటూ వైద్యాధికారి డాక్టర్ మధుసూదనాచారి వివరించారు.

ఎట్టకేలకు పంచాయతీ కార్యదర్శుల బదిలీ

- జిల్లాలో 289 మందికి స్థానచలనం
- సిఫార్సులకే పెద్దపీట
- ఆ 14 మండలాలపై రాని స్పష్టత

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 6: ఎట్టకేలకు జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరిగాయి. 289 మందికి స్థాన చలనం కలిగింది. ఇంకా 14 మండలాల విషయంలో స్పష్టత రాలేదు. జిల్లాలో 774 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 22 మేజర్ పంచాయతీలు. తమకు కావాల్సిన వారి కోసం నేతలు రెండు, మూడుసార్లు జాబితామార్చేందుకు తీవ్రస్థాయిలో అధికారులపై ఒత్తిళ్లు తెచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా శ్రీకాళహస్తి, నగరి, చంద్రగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల నుంచి ఒత్తిళ్లు ఎక్కువై.. ఒకటి రెండు సార్లు బదిలీల జాబితా మార్చినట్లు తెలిసింది. దీంతో ఎప్పుడో జరగాల్సిన పంచాయతీ కార్యదర్శుల బదిలీలు సాగుతూ వచ్చాయి. చివరకు ఆదివారం 19మండలాల పంచాయతీ కార్యదర్శుల బదిలీల జాబితాను విడుదల చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులు కూడా ఈ బదిలీల్లో ఉన్నారు. అత్యధికం రాజకీయ సిఫార్సులపైనే బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది. జిల్లాలో పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ 1 నుంచి 4 వరకు 172మందికి గాను తిరుపతి జిల్లా పరిధిలో 140మంది,చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాకు 16మంది, తిరుపతిజిల్లా నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 16మంది బదిలీ కావడం గమనార్హం. అదే విధంగా గ్రామవార్డు సచివాలయ పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ 5 కింద 95మంది బదిలీ అయ్యారు. పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ 6(డిజిటల్ అసిస్టెంట్) మొత్తం 22మంది బదిలీల జాబితాలో ఉన్నారు. జిల్లాలో 19మండలా నుంచి 289మంది బదిలీ అ యినట్లు డీపీవో సుశీలాదేవి తెలిపారు. కాగా, నెల్లూరు జిల్లా పరిధిలో నుంచి తిరుపతి జిల్లాలో చేరిన 14 మండలాల పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై జిల్లా యంత్రాంగానికి ఇంకా స్పష్టత లేకపోవడం గమనార్హం.



స్నపన తిరుమంజనం నిర్వహించే రంగనాయక మండపంలో అలంకరణ

తొమ్మిదిరోజుల పాటు వివిధ వాహనాల ఊరేగింపులో అలసిన ఉత్సవర్లకు శ్రమను పోగొట్టి.. తిరిగి మరింత తేజత్వాన్ని తీసుకొచ్చేందుకు బ్రహ్మోత్సవాల్లో మూడురోజుల పాటు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇది వందల ఏళ్లుగా పాటిస్తున్న ఆచారమని పురాణోక్తి. ప్రధానంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, చందనం, పసుపు, తులసి పత్రాలు, రాజోపచారాలైన చామరం(విసనకర్ర), అద్దం(దర్పనం), గొడుగు(ఛత్రం)విధిగా ఈకైంకర్యంలో వినియోగిస్తారు. విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. స్వదేశీతో పాటు విదేశీ పండ్లు, పూలు, ఎండు ఫలాలు, అరుదైన వేర్లు, ఆకులను వినియోగిస్తారు.

అలసిన స్వామికి సాంత్వనగా..!

- బ్రహ్మోత్సవాల్లో మూడురోజుల పాటు స్నపన తిరుమంజనం
- మాలలతో మొదలై కిరీటాలు, జడల వరకు..



తొలిసారి కివీ, పైనాపిల్ మాల - స్వామివారికి పసుపు కొమ్ముల దండ



కిరీటం, మాలలు చూపుతున్న టీటీడీ గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు

15 ఏళ్లుగా ఆ ముగ్గురే

టెక్స్‌టైల్స్ వ్యాపారంలో ఉన్న తిరుపూర్‌కు చెందిన రాజేంద్రన్, బాలసుబ్రహ్మణియన్, షణ్ముగం శ్రీవారికి పరమభక్తులు. కొన్నేళ్లుగా వీరు అన్నప్రసాదాలకు కూరగాయలను వితరణగా అందజేస్తూ వస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో వాహన సేవలను చూసిన వీరు ఎండు ఫలాలు, పుష్పాలతో మాలలు తయారు చేసి సమర్పించాలని సంకల్పించారు. అలా, 15 ఏళ్ల క్రితం మాలలతో మొదలై ఆ తర్వాత నెమ్మదిగా కిరీటాలు, జడల వరకు చేరాయి. అప్పట్లో ఆలయ ఓఎస్డీగా ఉన్న డాలర్ శేషాద్రి సహకారంతో ఆగమపండితులు, అర్చకుల అనుమతితో ఉత్సవర్ల కొలతలు తీసుకుని కిరీటాలు, మాలలు, జడలు, విసనకర్ర, కొప్పు దండలు ఇవ్వడం ప్రారంభించారు. పది మంది నిపుణులతో వీటిని తయారు చేయిస్తారు.

మనసుదోచేలా..

స్నపన తిరుమంజనం జరిగే మూడు రోజుల్లో టీటీడీ గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసుల ఆధ్వర్యంలో ప్రతిరోజు టన్ను సంప్రదాయ పుష్పాలు, కట్‌ఫ్లవర్స్‌తో రంగనాయక మండపాన్ని అలంకరిస్తున్నారు. దేశీయ తృణధాన్యాలతో పాటు పండ్లు, పూలు, సుగంధ ద్రవ్యాలతో పాటు జపాన్ యాపిల్స్, మస్కట్ ద్రాక్ష, కొరియా పియర్స్, థాయిలాండ్ మామిడి, అమెరికా చెరీస్ సహా వివిధ దేశాల్లో ఉన్న స్వామి భక్తులు ఈ అలంకరణకు పండ్లను పంపుతారు. ఇక, కిరీటాలు, మాలల తయారీకి ఎండు ద్రాక్ష, కివీ, పైనాపిల్, బాదం, పిస్తా, అప్రికాట్, తామరగింజలు, తులసి గింజలు, యాలకులు, పవిత్రమాలకు వినియోగించే నూలుపోగులు, వట్టివేరు, కురువేరు, పసుపు కొమ్ములు, చందనం, ముత్యాలు, గాజులు, రోజా పువ్వుల రేకులు, తులసి ఆకులను వినియోగిస్తారు.

ఎనిమిది సెట్ల కిరీటాలు, మాలలు

ఆదివారం నిర్వహించిన స్నపన తిరుమంజనంలోనూ ఎనిమిది సెట్ల కిరీటాలు, మాలలు వినియోగించారు. పసుపు కొమ్ములు, రోస్ పెటల్స్, కివీ-పైనాపిల్, వట్టివేరు-బ్లాక్ వెలివేట్, గోల్డ్ ఎండు ద్రాక్ష తెల్ల ముత్యాలు, సాండిల్ కలర్ పవిత్రాలు, తామరగింజలు-తులసి గింజలతో తయారు చెసిన మాలలు, కిరీటాలను స్వామికి సమర్పించారు. ఇందులో కివీ-పైనాపిల్ కిరీటాలు, మాలలను తొలిసారిగా వినియోగించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





గరుడసేవకు విస్తృత ఏర్పాట్లు: ఈవో

తిరుమల, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జరగనున్న గరుడసేవకు విస్తృత ఏర్పాట్లు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఈవాహనసేవ సాయంత్రం 6.30 గంటలకు మొదలై రాత్రి 11 గంటల వరకు జరుగుతుందన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. దాదాపు 2 లక్షల మంది భక్తులు గ్యాలరీల్లో వేచిఉంటారన్నారు. గరుడసేవ దర్శనం కోసం ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఔటర్ రింగురోడ్డులో వేచిఉండే భక్తులకు సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవిందనిలయం నార్త్ వెస్ట్ కార్నర్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా దర్శనం కల్పిస్తామన్నారు. వారి సౌకర్యార్థం అన్ని పాయింట్ల వద్ద అసరమైన సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు లగేజీతో పాయింట్లలోకి ప్రవేశించకూడదని సూచించారు. తిరుమల ఘాట్‌రోడ్లలో సోమవారం రాత్రి 9 నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు ద్విచక్రవాహనాల అనుమతిని రద్దు చేశామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో దాదాపు 3 వేల రౌండ్ ట్రిప్పుల ద్వారా దాదాపు 3 లక్షల మందిని తరలించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలను సులభంగా గుర్తించడానికి క్యూఆర్‌కోడ్‌లతో బోర్డులు పెట్టామన్నారు.



ఎస్పీ, టీటీడీ అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న ఈవో శ్యామలరావు

తిరుమలలో దాదాపు 25 ప్రదేశాల్లో 9 వేల వాహనాలకు సరిపడా పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు వైద్య సేవల కోసం మాడవీధుల్లో మొబైల్ క్లినిక్‌లు, 12 అంబులెన్స్‌లు, వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. గ్యాలరీల్లోకి రాలేని భక్తులకోసం తిరుమలలో 28 భారీ హెచ్‌డీ డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. గరుడసేవను పర్యవేక్షించేందుకు 1,250 మంది టీటీడీ విజిలెన్స్, 5 వేల మంది పోలీసులతో పాటు అక్టోపస్, గ్రే హౌండ్స్ బృందాలను కూడా ఏర్పాటు చేసినట్టు వివరించారు. నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు, అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో గౌతమి తదితరులు పాల్గొన్నారు.

వాహనసేవల్లో కళానీరాజనం

తిరుమల, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో ఆదివారం సింహ, ముత్యపుపందిరి వాహన సేవల్లో టీటీడీ ధార్మిక ప్రాజెక్ ఆధ్వర్యంలో కళా బృందాలు శ్రీవారికి కళానీరాజనాన్ని సమర్పించాయి. ఉదయం 530 మంది కళాకారులు తమ కళారూపాలతో శ్రీవారిని సేవించుకున్నారు. పద్మప్రియ(చెన్నై), హేమమాలిని(తిరుపతి) బృందాల భరతనాట్యం, వివిధ వేషధారణలు, సురేష్, వైష్ణవ సుగుమాన్ బృందాల(తమిళనాడు) మోహినియాట్టం విశేషంగా ఆకట్టుకున్నాయి. దివ్యశ్రీ బృందం(బెంగళూరు) ప్రదర్శించిన నిరసింహ కళాప్రదర్శన, బాగవతంలోని నరసింహావతారాన్ని కనుల ముందు సాక్షాత్కరింపజేసింది. ఉమారాణి బృందం (రాజమండ్రి) మయూరి నాగిని నృత్యం, వంశీధర్ చెంచులక్ష్మి బృందం(తిరుపతి) నరసింహమూర్తి, ప్రహ్లాదుల రూపాలతో అలరించారు. కెఎస్ వర్మ(మధ్యప్రదేశ్) చెలియ అనే జానపద కళారూపకం, మీనాక్షి బృందం(తమిళనాడు) కథక్ నృత్యం, భాగలక్ష్మి(అనకాపల్లి), కృష్ణవేణి(శ్రీకాకుళం), రేణుకాదేవి(తిరుపతి), చంద్రకళ(గూడూరు), శ్రీనివాసులు బృందాల(తిరుమల)కోలాట నృత్యాలతో భక్తులను తన్మయపరిచారు.

ముత్యపుపందిరి వాహనసేవలో..

రాత్రి వాహన సేవలో 541 మంది కళాకారులు తమ సంగీత నృత్య ప్రదర్శనలతో అలరించారు. మణిపూర్, రాజస్థాన్, పంజాబ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన జానపద సంప్రదాయ నృత్యాలు, మురళీకృష్ణ బృందం(తిరుపతి) ప్రదర్శించిన శ్రీకృష్ణావతారం నృత్యం రూపకం, దివ్యశ్రీ బృందం(బెంగళూరు) దశావతార మహోత్సవం, మర్రి లలితా బృందం(విశాఖ) నరసింహోద్భవ ఘట్టం, హర్సింగ్ వర్మ(మధ్యప్రదేశ్) ప్రదర్శించిన గిరిజన జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.తిరుపతి శ్రీవేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల విద్యార్థుల భరతనాట్యం, కూడిపూడి నృత్యం ప్రదర్శన అబ్బురపరిచింది.







సింహ వాహనంలో ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

సింహవాహనసేవలో నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరించారు. కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మ, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీవీఎల్ఎన్ చక్రవర్తి, టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఆవిష్కరించిన పుస్తకాల్లో.. మారెళ్ల వెంకట శేషారెడ్డి రచించిన 'శ్రీభాగవతము-ప్రశ్నావళి', కప్పగంతుల రామకృష్ణ రచించిన 'హైందవ సంస్కృతి-వైజ్ఞానికత', పుట్టపర్తి నాగపద్మిని రచంచిన 'తిరుమల తిరుపతి క్షేత్ర మహత్మ్యం', వావిలికొలను సుబ్బారావు రచించిన 'శ్రీమదొంమిట్ట కోదండరామ మహత్మ్యం వివరణ' ఉన్నాయి.



ఆలయ సిబ్బందికి వస్త్ర బహూకరణ



శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో సేవలు అందిస్తున్న వాహనం బేరర్లు, మేళం సిబ్బంది, శ్రీవారి ఆలయంలో పారిశుధ్య సిబ్బందికి ఆదివారం మెక్కినేశ్వరి టెక్స్‌టైల్స్ అధినేత తంగదొరై దంపతులు (సేలం) వస్త్ర బహుమానంగా అందజేశారు. తిరుమలలోని వైభోత్సవ మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి చేతుల మీదుగా ఈవస్త్రాలను అందజేవారు. ఈసందర్భంగా దాతలకు స్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని అదనపు ఈవో ఆకాంక్షించారు.

ముత్యపు పందిరిలో..

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి ముత్యపు పందిరి వాహనంలో మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి.



అలరించిన శోభారాజ్ గానామృతం

బ్రహ్మోత్సవాల్లో ఆదివారం టీటీడీ ఆస్థాన గాయని, పద్మశ్రీ గ్రహీత శోభారాజ్ నిర్వహించిన గానామృతం భక్తులను అలరించింది. దాదాపు పదేళ్ల తర్వాత ఆమె గాత్ర కచేరి చేశారు. చిత్తము కొలది, గణరాజు గుణరాజు, శిరుత నవ్వుల వాడే, వేడుకుందామా, కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు.. అంటూ మధురంగా గీతాలను ఆలపించారు. అంతకుముందు నరసింహాచార్యులు(నెల్లూరు) 'శ్రీవేంకటాచల మహత్యంలో గోవిందనామా వైభవం' అనే అంశంపై ఉపన్యసించారు. నాదనీరాజనం వేదికపై ఎస్వీ సంగీత నృత్య కళాశాలకు చెందిన రవిప్రభ, సుబ్రహ్మణ్యం సత్యనారాయణ, ముని శంకర కృష్ణ బృందం మంగళధ్వని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆచార్య చక్రవర్తి రంగనాథన్(తిరుపతి) 'తైతిరీయోపనిషత్-సామాజిక సందేశం' అనే అంశంపై ఉపన్యసించారు.



బసలేక పెరటాసి భక్తుల ఇబ్బందులు

- తోలప్ప గార్డెన్ షెడ్ వాడుకోవాలని ఏవీఎస్వో సూచన

తిరుచానూరు, అక్టోబరు 6: పెరటాసి మాసం కావడంతో వేలసంఖ్యలో తమిళనాడు నుంచి పాద్రయాత్ర తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి నడిచివస్తారు. ఈ క్రమంలో తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని ఒక పూట నిద్రించి మర్నాడు స్వామివారిని దర్శించుకోడానికి వెళ్లడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. అయితే టీటీడీ వసతి గృహం ఏర్పాటు చేయకపోవడంతో వీరంతా మాడవీధుల్లో, రోడ్లపై నిద్రించాల్సిన దుస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం పద్మావతి వసతి గృహాన్ని కలెక్టరేట్‌కు ఇవ్వడంతో భక్తులు రోడ్లపై పడుకుంటున్నారు. మాడవీధుల్లో నిద్రిస్తున్న తమిళ భక్తులను శనివారం అర్థరాత్రి అమ్మవారి ఆలయ సెక్యూరిటీ వచ్చి భక్తులను లేచి వెళ్లండంటూ గదమాయించారు. తాము ఎక్కడి వెళ్లాలని భక్తులు అడిగినా వారు వినలేదు. దీంతో భక్తులు కన్నీటి పర్యంతమయ్యారు. అమ్మవారి భక్తుల కోసం గత పాలక మండలి వసతిగృహం నిర్మించడానికి అనుమతించింది. కానీ ముందడుగు పడలేదు. ఇప్పటికైనా టీటీడీ యంత్రాంగం వసతిగృహాన్ని వేగవంతంగా నిర్మించాలని కోరుతున్నారు. దీనిపై ఆలయ ఏవీఎస్వో సతీష్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మాడవీధుల్లో రాత్రి సమయాల్లో కూడా వాహనాలు వస్తుంటాయన్నారు. భక్తులకు భద్రత ఉండదని, తోలప్ప గార్డెన్ లో షెడ్ ఏర్పాటు చేశామన్నారు. అక్కడ రాత్రి సమయంలో భక్తులు సేద తీరవచ్చని సూచించారు.



భక్తులను వెళ్లిపోమంటున్న సెక్యూరిటీ సిబ్బంది



భక్తుల కోసం తోలప్పగార్డెన్‌లో షెడ్డు

లడ్డూ క్యూ వద్ద ఆధార్ స్కాన్

- ప్రయోగాత్మకంగా 6 కౌంటర్లలో అమలు

తిరుమల, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): లడ్డూల కోసం ఎక్కువ సమయం క్యూలైన్‌లో వేచిఉండకుండా కొత్త విధానాన్ని టీటీడీ పరిశీలిస్తోంది. శ్రీవారిని దర్శించుకోని భక్తులకు టీటీడీ ఆధార్ కార్డు వివరాలను నమోదు చేసుకున్న తర్వాతే లడ్డూలు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రక్రియతో క్యూలైన్‌లో అధిక సమయం ఉండాల్సి వస్తోందని గుర్తించారు. దీంతో ఆధార్‌కార్డుపై ఉన్న బార్‌కోడ్‌ను స్కాన్ చేస్తే వివరాలు వచ్చేలా సాఫ్ట్‌వేర్‌ను తీసుకువచ్చింది. దీనిని ప్రస్తుతం లడ్డూ విక్రయ కేంద్రంలోని ఆరు కౌంటర్లలో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు.



వాహన సేవ ముందు కళా ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

కడివేటికి కళాకోవిద పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మునిరత్నం

తిరుపతి అర్బన్, అక్టోబరు 6: తిరుపతి రవీంద్రనగర్‌కు చెందిన డాక్టర్ కడివేటి మునిరత్నానికి కళాకోవిద పురస్కారం దక్కింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో శనివారం రాత్రి జరిగిన దసరా సాంస్కృతిక సంబరాలలో భాగంగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. దసరా కల్చరల్ ఫెస్టివల్ ఇన్ థాయ్‌లాండ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తెలుగు పలుకులు, పాటలతో అక్కడి తెలుగు వారిని ఆకట్టుకున్నారు. థాయ్‌లాండ్ యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్ అండ్ కల్చర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ రామచంద్ర, తెలుగు అసోసియేషన్ ప్రెసిడెంట్ రవికుమార్ ఆయనకు పురస్కారం అందజేశారు. కళాకారులు, స్నేహితులు అభినందించారు.

ఊకాకు చిన్నంగారి అభినందన



తిరుపతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన టీడీపీ సీనియర్ నేత ఊకా విజయకుమార్‌ను టీటీడీ మాజీ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ సత్కరించారు. ఆదివారం ఊకా కార్యాలయంలో చిన్నంగారి రమణ తన మిత్రులతో కలసి శ్రీవారి జ్ఞాపిక, దుశ్శాలువతో అభినందించారు భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని ఆయన అభిలషించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూరా రాజు, చిన్నంగారి రవి, రామారావు, బుల్లి, రాఘవేంద్ర, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 24 గంటలూ దరఖాస్తుల స్వీకరణ

నాయుడుపేట, అక్టోబరు 6: జిల్లాలో మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ కోసం ఎక్సైజ్ కార్యాలయాలు 24 గంటలూ పనిచేస్తాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ తెలిపారు. నాయుడుపేట సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని 11 ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 227 దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. గూడూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 18, వాకాడు సర్కిల్‌లో 15, సూళ్లూరుపేట సర్కిల్‌లో 21, నాయుడుపేట సర్కిల్‌లో 17, వెంకటగిరి సర్కిల్‌లో 15 మద్యం దుకాణాల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 11న తిరుపతిలోని శిల్పారామంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ నిర్వహించి దుకాణాలు కేటాయించడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు టోల్ ఫ్రీ నెంబరు 040-4242550కు కాల్‌చేసి సహాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్ రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పీఎస్ ఉహారెడ్డి, ఎక్సైజ్ సీఐలు అరుణకుమారి, ప్రసాద్, సురేంద్రబాబు, సూర్యనారాయణ, కరీమాబేగం తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, అక్టోబరు 6: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 25వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,346మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,708మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,216మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 826, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 218మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 197మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 42మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 16,968 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

తిరుపతి

అభిరామిదేవి అలంకరణలో..



తిరుపతి అర్బన్, అక్టోబరు 6: లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వ నాథస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి అమ్మవారు అభిరామిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలవర్లకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో మహిళలు ఆలయ ప్రాంగణంలో పిండి తలిగలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మా స్థలాన్ని మాకు ఇప్పించండి



ఇంటిని కూల్చిన చిత్రాలు చూపుతున్న బాధితురాలు

తిరుపతి(లీలామహల్), అక్టోబరు 6: తమ పూర్వీకుల నుంచి వచ్చిన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాలని తిరుపతి అర్బన్ మండలం మంగళం హరిజనవాడకు చెందిన గుర్రమ్మ కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ నానమ్మ వెంకటమ్మ 19 ఏళ్ల క్రితం తమకు ఆ స్థలాన్ని రాసిచ్చిందని, అప్పటి నుంచి అక్కడే నివాసముంటున్నామని తెలిపారు. ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని తిరుపతికి చెందిన గిరిధర్‌రెడ్డి బెదిరిస్తున్నాడని పేర్కొన్నారు. పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. గతనెల 24వ తేదీన తాము ఇంట్లో లేని సమయంలో ఇంటిని కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిధర్‌రెడ్డి, అతని అనుచరుల నుంచి రక్షణ కల్పించి, స్థలం ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

అల్పాహారం పంపిణీ

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 6: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం ఏడుకొండల బస్టాండులో ఆర్టీసీ తిరుపతి రీజియన్ కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో భక్తులకు, డ్యూటీ డ్రైవర్లకు అల్పాహారం పంపిణీ చేశారు. డీపీటీవో చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం భాస్కర్ రెడ్డి, డీఎం బాలాజీ, టీడీపీ పట్టణాధ్యక్షుడు ఒట్టికుంట శంకరనారాయణ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీపతి, తిరుపతి రీజియన్ కార్మిక పరిషత్ అధ్యక్షుడు జి.రవి, కార్యదర్శి ఈ.ఎం.రెడ్డెప్పనాయుడు, కె.ఎం.రత్నం, మాధవయ్య, పి.జే.వీ.ఎస్ మణ్యం, వీఎస్ రావు, ఎం.ఎస్.రెడ్డి, కె.భారతి, రామయ్య పాల్గొన్నారు.

మిగిలిందిక మూడు రోజులే

● 227 మద్యం షాపులకు 165 టెండర్లు దాఖలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 6: జిల్లాలో 227 మద్యం షాపులకుగాను ఇప్పటి వరకు 165 టెండర్లు దాఖలయ్యాయి. ఈ మేరకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి ఆదివారం సాయంత్రం చెప్పారు. కాగా, టెండర్ల దాఖలుకు 9వ తేది వరకు గడువు ఉంది. దరఖాస్తుదారులకు అవగాహన కల్పించి అవసరమైన మేరకు ఒక్కో షాపునకు 10 నుంచి 15 టెండర్లు దాఖలయ్యేలా చూసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దరఖాస్తు చేసే విధానం, దరఖాస్తు ఫీజు, లైసెన్సు ఫీజు వంటి వాటిపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రానున్న మూడు రోజుల్లో మరెన్ని దరఖాస్తులు దాఖలవుతాయో చూడాలి. ఇంత తక్కువ సంఖ్యలో టెండర్ల దాఖలు వెనుక కొందరు నేతల ఒత్తిళ్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. తమకు తెలియకుండా టెండర్లు వేయడానికి వీల్లేదని కొందరు నేతలు హెచ్చరించడం.. మరోవైపు ఇన్‌కంట్యాక్సు భయంతోనూ పలువురు టెండర్లు వేయడానికి వెనుకడుగు వేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

కామాక్షితాయికి బంగారు లక్ష్మీహారం బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 6: నెల్లూరు జిల్లా బుచ్చి మండలంలోని జొన్నవాడ కామాక్షితాయికి ఆదివారం తిరుపతికి చెందిన ఎల్.సత్యనారాయణ, వెంకట శోభాలక్ష్మి దంపతులు 52.184 గ్రాముల బంగారు లక్ష్మీ కాసుల హారం బహూకరించారు. ముందుగా దాతలు అర్చకస్వామి శ్రీశైలం శ్రీధర్‌తో కలిసి ఆ హారాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ.శ్రీనివాసులురెడ్డికి అందజేసి రసీదు పొందారు. దాతలకు వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

అన్నపూర్ణేశ్వరిగా గంగమ్మ



తాతయ్యగుంట గంగమ్మకు గొడుగుల వితరణ

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 6: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఊంజలసేవ నిర్వహించారు. తిరుపతికి చెందిన వేలూరు కుసుమమ్మ కుటుంబ సభ్యులు గంగమ్మకు రెండు నూతన గొడుగులు బహూకరించారు. ఆలయ ఈవో జయకుమార్, రాయలసీమ రంగస్థలి వ్యవస్థాపకుడు గుండాల గోపినాథ్‌రెడ్డి, కుసుమమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కపిలతీర్థంలో..

కపిలతీర్థం ఆలయంలో ఆదివారం ఉదయం కామాక్షి, కపిలేశ్వరులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజలసేవ నిర్వహించారు. కామాక్షి అమ్మవారు శ్రీమహాలక్ష్మి రూపంలో భక్తులను అనుగ్రహించారు.

మహిషాసురమర్దినిగా బొంతాలమ్మ



తిరుపతి (జీవకోన), అక్టోబరు 6: కరకంబాడి రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో హోమం, మహాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవ చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు.

అన్నపూర్ణాదేవిగా చాముండేశ్వరి





అన్నపూర్ణాదేవి అలంకరణలో శక్తిచాముండేశ్వరీదేవి, అన్నదానం చేస్తున్న నరసింహయాదవ్, డాలర్స్ దివాకర్‌రెడ్డి దంపతులు

తిరుపతిరూరల్, అక్టోబరు 6 : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట క్రాస్ ఎల్ఎస్ నగర్‌లోని శక్తి చాముండేశ్వరీదేవి ఆదివారం అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకారం, హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి, ఉభయదారులు గజేంద్రబాబు, సుధాకర్, నరేష్‌బాబు భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో: శక్తిచాముండేశ్వరిదేవిని ఆదివారం తుడా మాజీ ఛైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అన్నదాన కార్యక్రమంలో సేవలందించారు.

శాప్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతాం

చైర్మన్ రవినాయుడు



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 6: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థను మోడల్‌గా తీర్చిదిద్దుతామని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు తెలిపారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో ఆదివారం సాయంత్రం ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్‌జిల్లాల తైక్వాండో పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడా సముదాయాల్లో మౌళిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. నూతన అకాడమీల ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలను అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. కాగా, ఈ పోటీలకు 700మంది క్రీడాకారులు(అండర్ 14, 17బాల బాలికలు) హాజరయ్యారు. లీగ్ పోటీలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో చదరంగం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాలర్స్ దివాకర్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బాబు, డీఈవో శేఖర్, డిప్యూటీ డీఈవో బాలాజీ, జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

యోగనరసింహునిగా కల్యాణ వెంకన్న



తిరుపతి రూరల్, అక్టోబరు 6 : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారు యోగనరసింహుని అవతారంలో సింహ వాహనాన్ని అధిష్ఠించి భక్తులను అనుగ్రహించారు. తిరుచానూరు, పాడిపేట, ముండ్లపూడి పంచాయతీల నుంచి ప్రజలు తరలివచ్చి సారె సమర్పించారు. రాత్రి 7గంటలకు స్వామివారు ముత్యపుపందిరిలో కొలువుదీరి కాళీయ మర్దన చిన్నికృష్ణుని అవతారంలో భక్తులకు చల్లని దీవెనలు అందించారు. అంతకుముందు ఊంజలసేవ నిర్వహించారు. కేరళ కళాకారుల బృంద వాయిద్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలచింది. ఆలయ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

స్థానికతే కథా వస్తువు

● జక్కదొన కథా సంపుటి ఆవిష్కరణలో శ్రీనివాసరాజు



తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 5: రచయిత ఆర్‌సీ కృష్ణస్వామి రాజు కథల్లో స్థానికతే కథా వస్తువుగా ఉంటుందని, మానవత్వ విలువలు నిండి ఉంటాయని టీటీడీ మాజీ జేఈవో, తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఆదివారం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాశ్చ్య పరిశోధన సంస్థ (ఓఆర్‌ఐ) ఆధ్వర్యంలో వర్సిటీ సెనేట్ హాల్లో కృష్ణస్వామి రాజు రచించిన జక్కదొన కథాసంపుటిని ఆవిష్కరించారు. తొలి ప్రతిని ఎస్వీయూ గ్రంథాలయ విశ్రాంత అధికారి షణ్ముగం స్వీకరించారు. ముఖ్య అతిథిగా వర్సిటీ ఉప కులపతి ఆచార్య సీహెచ్ అప్పారావు, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతినాయుడు, ప్రత్యేక అతిథిగా చెన్నై రాజధాని కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు ఎస్ ఎలిజబెత్ జయకుమారి హాజరయ్యారు. శ్రీనివాసరాజు మాట్లాడుతూ పుట్టి పెరిగిన ప్రాంతం మూలాలను మరచిపోకుండా సామాజిక జీవనాన్ని అక్షరబద్ధం చేస్తున్న కృష్ణస్వామి రాజు అభినందనీయుడన్నారు. రచయిత జీవనానుభవం నుంచి వచ్చిన ఈ కథల్లో మానవీయ కోణం ప్రధానంగా కనిపిస్తుందని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఓఆర్‌ఐ సంచాలకులు ఆచార్య వీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కృష్ణస్వామి రాజు కథలు పాఠకులను ఆకట్టుకునేలా ఉంటాయని తెలిపారు. గరికపాటి రమేష్‌బాబు పుస్తక సమీక్ష చేశారు. ఈ సభలో నడింపల్లి సత్యనారాయణ రాజు, ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, ఆచార్య రాజేశ్వరమ్మ, ఆచార్య గోవిందరాజులు, గాలి గుణశేఖర్, మల్లేశ్వరరావు, మౌని, సాకం నాగరాజ, యువశ్రీమురళి, పేరూరు బాలసుబ్రమణ్యం, నెమిలేటి కిట్టన్న, పలువురు సాహితీప్రియులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యాటక రంగం వీడియోలకు గడువు పెంపు

తిరుపతి(కలెక్టరేట్): జిల్లాలో పర్యాటకరంగం ప్రమోషన్ కోసం ఔత్సాహికులు పాల్గొని ఉత్తమ వీడియోలు/రీల్స్ తయారు చేసి పంపేందుకు అక్టోబరు 25వ తేది వరకు గడువు పొడిగించినట్లు కలెక్టరు వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నిమిషాల నిడివిగల అత్యుత్తమ వీడియోలు, రీల్స్ పంపిన వారికి మొదటి బహుమతి కింద రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50వేలు, మూడవ బహుమతిగా రూ.25వేలు ఇవ్వనున్నారు.

అంతరిక్ష వారోత్సవ పోటీల్లో ప్రతిభ



తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 6: అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఇస్రో-షార్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పోటీల్లో ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్ కుమారుడు, కేంద్రీయ విద్యాలయ విద్యార్థి పి.వెంకటఆనందకృష్ణ రెండు విభాగాలలో(మాక్, డిస్‌ప్లే ఆఫ్ ప్రాజెక్టు మోడల్స్) రెండో స్థానం కైవసం చేసుకున్నాడు. మహిళా విశ్వవిద్యాలయం డీన్ కాత్యాయని నుంచి మెడల్స్, సర్టిఫికెట్ అందుకున్నాడు.

ప్రమాదకరం





తిరుపతి (లీలామహల్), అక్టోబరు 6: స్థానిక లీలామహల్ కూడలిలో బైపాస్ రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. కపిలతీర్థం నుంచి బస్టాండు వైపు వెళ్లే వాహనాలు లీలామహల్ సిగ్నల్ వద్ద నిలబడతాయి. అదే ప్రాంతంలో రోడ్డు కింద మట్టి కొట్టుకుపోవడం, పక్కనే డ్రైనేజీ కాల్వ ఉండడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి రోడ్డు కింద ఏర్పడిన గొయ్యి పూడ్చాలని కోరుతున్నారు.

వైసీపీ రెచ్చగొట్టే మాటలు నమ్మొద్దు

హోంమంత్రి అనిత



అస్పియా తల్లిని ఓదారుస్తున్న హోంమంత్రి అనిత

పుంగనూరు, అక్టోబరు 6: ఆరేళ్ల బాలిక అదృశ్యం, హత్య కేసును కొద్ది రోజుల్లోనే ఛేదించడాన్ని ఓర్వలేక ప్రభుత్వం, పోలీసులపై వైసీపీ నేతలు చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యలను నమ్మొద్దని ప్రజలకు హోంమంత్రి అనిత సూచించారు. ఆదివారం పుంగనూరులో ఆమె మీడియాతో మాట్లాడారు. బాలికను సజీవంగా తీసుకురావాలని పోలీసులు రాత్రింబవళ్లు కష్టపడి పనిచేశారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, ఎన్ఎండీ ఫారూఖ్‌తో కలిసి ఇక్కడికి వచ్చామన్నారు. బాధిత బాధిత కుటుంబీకులను పరామర్శించి, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చామన్నారు. అయితే బిడ్డ మృతితో ఆ కుటుంబం బాధపడుతుంటే.. ఓదార్చాల్సింది పోయి.. జగన్ మీడియా మాత్రం బాలికను నలుగురు అత్యాచారం చేశారంటూ అసత్యాలు ప్రచారం చేయడం దారుణమన్నారు. 'నా వద్ద ఐదుగురు డాక్టర్లు సంతకాలు చేసిన పీఎం రిపోర్టు ఉంది. అందులో అత్యాచారం జరగలేదు. శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. బట్టలు చిరగలేదు అని ఉంది' మంత్రి వివరించారు. ఈ పరిస్థితుల్లో ముస్లిం మైనార్టీ బాలిక మృతిని కూడా రాజకీయం చేయడానికి వైసీపీ ముందుకు వచ్చిందని దుయ్యబట్టారు. పైగా పక్క నియోజకవర్గ ఎమ్మెల్యే ఇక్కడికొచ్చి రెచ్చగొట్టడం ఏంటని ప్రశ్నించారు. ఇక పుంగనూరులో గంజాయి, డ్రగ్స్ అరికట్టాలని కొందరు తన దృష్టికి తీసుకు రావడంతో ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే పలమనేరు విద్యార్థిని మిస్సా కేసులోనూ న్యాయం జరగలేదని బాధితులు చెప్పారన్నారు. ఆ కేసునూ రీఓపెన్ చేసి, బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళలపై వేల సంఖ్యలో అఘాయిత్యాలు జరిగినా అప్పటి సీఎం జగన్ ఏమాత్రం పట్టించుకోలేదంటూ మంత్రి రాంప్రసాద్ రెడ్డి విమర్శించారు. ప్రశ్నించిన వారిపైనే కేసులు పెట్టారని గుర్తుచేశారు. ఒకే కుటుంబానికి చెందిన పుంగనూరు, తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు, రాజంపేట ఎంపీ.. సున్నితమైన బాలిక విషయాన్ని రాజకీయంగా చూడకుండా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సూచించారు. మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో ఫైళ్లు కాల్చివేసిన విషయాన్ని పక్కదారి పట్టించేలా శవ రాజకీయాలు చేయడం వైసీపీకి తగదని మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఫారుఖ్ అన్నారు. గతంలో ముస్లిం మైనార్టీలపై అఘాయిత్యాలు జరిగితే వైసీపీ నేతలు, జగన్ ఏమాత్రం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

పసిబిడ్డల జోలికి రావాలంటే భయపడాలి

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసి.. అస్పియా తండ్రి అజ్మతుల్లాతో మాట్లాడించారు. 'నా బిడ్డను చంపిన హంతకులను కఠినంగా శిక్షించండి. ఎంతలా అంటే పసిబిడ్డల జోలికి ఎవరన్నా రావాలంటే భయపడాలి. పోలీసులు మాకు అండగా నిలిచారు. పుంగనూరులో కులమతాలకు అతీతంగా ప్రజలంతా కదిలివచ్చారు. మీపైనా, మీ ప్రభుత్వంపైనా నాకు నమ్మకముంది' అని చంద్రబాబుతో అజ్మతుల్లా అన్నారు. నేరాలు చేసే దుర్మార్గులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని సీఎం తెలిపారు.

రేపు పాలిటెక్నిక్‌లో మెగాజాబ్ మేళా

సత్యవేడు, అక్టోబరు 6: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈనెల 8వ తేదీ మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. బ్లూస్టార్, హీరోమోటో కార్ప్, ఎయిర్‌టెల్ పేమెంట్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, బీటెక్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో రావాలని కోరారు. వివరాలకు నెం.9440374535లో సంప్రదించాలన్నారు.

నేటినుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

సత్యవేడు, అక్టోబరు 6: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 2023 - 2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఉపాధి ఏపీవో కృష్ణయ్య తెలిపారు. కాగా మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో రూ. 14.26 కోట్ల విలువైన 557 పనులు చేపట్టారు.

ప్రవీణ్ బంధువులే హంతకులు?

● పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

ఏర్పేడు, అక్టోబరు 6: మండలంలోని రావిళ్లవారికండ్రిగ వద్ద ఎరుకలప్పచలం ఎరుకలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో మామిడితోట వద్ద వంట మాస్టర్ ప్రవీణ్ హత్యకు గురైన విషయం తెలిసిందే. సమీప బంధువులే హత్య చేసినట్లు సమాచారం. దర్యాప్తు చేస్తున్న ఏర్పేడు సీఐ శరవేగంగా 24 గంటలు గడవకమునుపే ప్రవీణ్ కుటుంబసభ్యులు ఇచ్చిన ఆధారాల మేరకు హత్య చేసిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వారిని ఆదివారండీఎస్పీ శ్రీనివాస్ విచారించినట్లు తెలుస్తోంది.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కేవీబీపురం, అక్టోబరు 6: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వీరాంజనేయులు చెప్పారు. తమ బ్యాంకు ఖాతాలు, డెబిట్, క్రెడిట్, ఆధార్, పాన్‌కార్డులు తదితర నెంబర్లను అపరిచిత వ్యక్తులకు చెప్పకుండా జాగ్రత్త పడాలన్నారు. ఇటీవల చాలమందికి తాము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఫోన్లు వస్తున్నాయని ప్రజలు వాటికి సమాధానం చెప్పడంతో వారి ఖాతాల్లో నగదును కాజేస్తున్నారన్నారు. అపరిచిత కాల్‌కు సమాధానం ఇవ్వకూడదన్నారు.

పుత్తూరు వార్తలు

గురుకుల పాఠశాలల

నిత్యావసరాల టెండర్ల ప్రక్రియ పట్ల హర్షం

పుత్తూరు, అక్టోబరు 6 : ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో గిరిజన గురుకుల పాఠశాలలకు నిత్యావసర వస్తువుల సరఫరా టెండర్ ప్రక్రియ పారదర్శకంగా జరగడం పట్ల రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి ఇరువరం చిరంజీవి ఓ ప్రకటనలో హర్షం ప్రకటించారు. గత నెల నెల్లూరు ఐటీడీఏ అధికారులు టెండర్ల ప్రక్రియను పరిశీలించి సరఫరాదారులను ఎంపిక చేశారని తెలిపారు. గతంలో మెనూ ప్రకారం సరకులను పంపిణీ చేయకుండా నాసిరకం సరకులను పంపిణీ చేసి పేద విద్యార్థుల పొట్టలు కొట్టేవారని విమర్శించారు. ఈ విషయమై అధికారులకు ముందస్తుగా ఫిర్యాదులు చేశామన్నారు. నిత్యావసర వస్తువులు జీఎస్టీ పరిధిలోకి రాకున్నా కొత్తగా టెండర్లు దక్కించుకున్న వారికి జీఎస్టీ లైసెన్సు లేదని కొంతమంది ఆరోపించడం అవగాహన లోపమన్నారు. సరఫరాదారులు సక్రమంగా పంపిణీ చేయకుంటే టెండరులో పాల్గొన్న తరువాత వ్యక్తికి సరఫరా చేసే అవకాశముందన్నారు.

ఎదుల్లా హుస్సేన్‌కు కలాం అవార్డు


అవార్డు అందుకుంటున్న ఎదుల్లా హుస్సేన్

పుత్తూరు టౌన్, అక్టోబర్ 6: నగరి నియోజకవర్గ మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎస్.డి. ఎదుల్లా హుస్సేన్‌ను బహుజన సాహిత్య అకాడమీ 8వ నేషనల్ కాన్ఫరెన్స్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డుతో సత్కరించింది. మైనార్టీ హక్కుల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎదుల్లా హుస్సేన్‌కు తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందించారు. రాధాకృష్ణ, విష్ణువర్ధన్, పి.స్వామి, నగరి నియోజకవర్గ టీడీపీ మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ, ఎస్.కే.షబ్బర్, హమీద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవీదేవి అలంకరణలో నాగాలమ్మ


వైష్ణవీదేవి అలంకరణలో నాగాలమ్మ - వడమాలపేటలో గాయత్రీదేవి అలంకరణలో వాసవీదేవి

పుత్తూరు టౌన్/ వడమాల పేట, అక్టోబర్ 6: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భకులను కటాక్షించారు. సోల మలై నాటార్లు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కిష్టప్ప మొదలి, సభ్యులు పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న నాగాలమ్మ ఆలయంలో అమ్మవారు వైష్ణవి దేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మండలంలోని రాచపాలెంలో ఉన్న లక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. ఉభయదారులుగా ప్రతాప్ రాజు, గోపిరాజు, పురుషోత్తంరాజు, సుబ్రమణ్యం యాదవ్, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వడమాలపేట పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు శ్రావణ్



వడమాలపేట, అక్టోబర్ 6: రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన శ్రావణ్ కుమార్ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పిడి చంద్ర శేఖర్ రాజు తెలిపారు. అండర్ 17 రాష్ట్ర గ్రీకో రోమన్ రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వడమాలపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 10 వ తరగతి విద్యార్థులు పూడి శ్రావణ్‌కుమార్(92 కిలోల) విభాగంలో బంగారు పతకాన్ని, వేలూరు ఉదయ్‌కుమార్(71 కిలోల) విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు. బంగారు పతకాన్ని సాధించిన శ్రావణ్‌కుమార్ ఈ నెల 22 వ తేది నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్‌లో రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు.

గోవింద భక్తులకు అన్నదానం


తడుకు ఆర్‌ఎస్‌లో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

వడమాలపేట, అక్టోబర్ 6: తమిళనాడు నుంచి తిరుమలకు నడిచి వెళ్లే భక్తులకు తడుకు ఆర్‌ఎస్ వద్ద ఆదివారం అన్నదానం, వైద్య శిబిరం నిర్వహించారు. బాలాజీ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేశారు. 18 సంవత్సరాలుగా శ్రీవారి బ్రహ్మోత్సవ రోజుల్లో గోవింద భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు ట్రస్టీ రామచంద్రరాజు చెప్పారు. డాక్టర్ శృతి, సాయి, ప్రకాష్‌రాజు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, నాయకులు నారాయణబాబు, భాస్కర్‌రెడ్డి, అములు, బంగారయ్య, ప్రకాష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పాహిమాం మాతా... పాహిమాం


ప్రత్యేక అలంకారంలో వేడాం దక్షిణ కాళికాదేవి - కామాక్షిదేవి అలంకారంలో పొన్నాలమ - బొమ్మల కొలువులో కూష్మాండదేవి అలంకారంలో దర్శనమిస్తున్న జ్ఞానప్రసూనాంబ - అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ - కామాక్షిదేవి అలంకారంలో కనకాచలం కనకదుర్గమ్మ ఉత్సవమూర్తి - ప్రత్యేక అలంకారంలో ముత్యాలమ్మ

శ్రీకాళహస్తి, అక్టోబరు 6: పాహిమాం... మాతా పాహిమాం... అంటూ భక్తులు అమ్మవార్లకు ప్రణమిల్లారు. దసరా ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో ఆయా ఆలయాల్లో కొలువుదీరి భక్తులను కటాక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞాన ప్రసూనాంబిక ఉత్సవమూర్తి ప్రత్యక్షం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు రంగులగోపురం వరకు అమ్మవారు విహరించారు. ఆలయంలోని ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఉత్సవమూర్తి కూష్మాండ దేవిగా కొలువుదీరారు. ఇదే ఆలయంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ అన్నపూర్ణదేవి అలంకారంలో, ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై ఉన్న కనకదుర్గమ్మను మూలమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవమూర్తిని కామాక్షిదేవిగా, వేడాం దక్షిణకాళికాదేవి ప్రత్యేక అలంకారంలో, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరిని ఆత్మార్పణ వాసవి కన్యకా పరమేశ్వరిగా అలంకరించారు. బీపీఅగ్రహారం గంగమ్మ మహాలక్ష్మిగా, పెద్దగంగమ్మ కామాక్షిదేవిగా, పానగల్‌లో గంగమ్మ ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. భాస్కరపేట చాముండేశ్వరి అమ్మవారు లలితాదేవిగా, ముత్యాలమ్మ గుడివీధిలోని ముత్యాలమ్మ ప్రత్యేక అలంకారంలో, బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథుని అలంకారం, తెట్టులోని నల్లగంగమ్మ అన్నపూర్ణగా, విశ్వబ్రాహ్మణ వీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మగుడి వీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, పొన్నాలమ్మ, పూసలవీధి గంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంత మైదానం అంకాళమ్మ, పీవీరోడ్డులోని అంకమ్మ అమ్మవార్లు విశేషాలంకారంలో భక్తులపై వరాల జల్లు కురిపించారు.


ఆత్మార్పణ వాసవి కన్యకాపరమేశ్వరి అలంకారంలో బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి - మహాలక్ష్మి అలంకారంలో బీపీఅగ్రహారం చిన్న గంగమ్మ - కామాక్షిదేవి అలంకారంలో పెద్దగంగమ్మ - లలితాదేవిగా భాస్కరపేట చాముండేశ్వరి అమ్మవారు


అన్నపూర్ణదేవిగా నల్లగంగమ్మ - ప్రత్యక్ష అవతారంలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారు- అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథుడి అలంకారంలో బహదూరుపేట కన్యకాపరమేశ్వరి అమ్మవారు

వైభవంగా శరన్నవరాత్రులు



ఏర్పేడు, అక్టోబరు 6: మండలంలో గత మూడు రోజులుగా దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా చిందేపల్లి సిద్ధేశ్వరస్వామి ఆలయంలో పార్వతిదేవి అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గుడిమల్లంలో అమ్మవారి ఆదిపరాశక్తిగా భక్తులకు దర్శనమిచ్చారు.

గుడిమల్లం ఆలయంలో కుంకుమపూజ



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుడిమల్లం పరశురా మేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజలో టీడీపీ సీనియర్ నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరం ధనంజయులు నాయుడు కుటుంబంతో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో జరిగే అన్నదాన కార్యక్రమానికి రూ.5,116 విరాళాన్ని అందించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, అక్టోబరు 6: శ్రీకాళ హస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి సుమారు 25వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,346మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,708మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,216మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 826, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 218మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 197మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 42మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 16,968 విక్రయించారు.

అన్నపూర్ణాదేవిగా చెంగాళమ్మ



వరదయ్యపాళెం, అక్టోబరు 6: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో అమ్మవారు ఆదివారం భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అంబూరులోని కామాక్షమ్మ అమ్మవారు లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు.

నారాయణవనం: మండలంలోని సముదాయంలో ఉన్న టీటీడీ అనుబంధ ఆలయమైన అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే కైలాసనాథ కోనలో కామాక్షి అమ్మవారిని లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

సత్యవేడు: పట్టణంలోని కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సర్వమంగళా దేవి అమ్మవారిని పసుపు కొమ్ములు, వివిధ పుష్పాలతో లలితా త్రిపురసుందరి దేవిగా తీర్చిదిద్దారు.


నారాయణవనంలో... సత్యవేడులో...

సైకిల్ రంగన్నకు టీడీపీ నాయకుల నివాళి



వరదయ్యపాళెం, అక్టోబరు 6: టీడీపీ ఆవిర్భావం నుంచి మండలంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే సైకిల్ రంగన్న మృతి పార్టీకి తీరని లోటని నాయకులు అన్నారు. సంతవేలూరులోని ఆయన స్వగృహంలో ఆదివారం ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన మృతదేహంపై టీడీపీ జెండాను కప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌నాయుడు, వరదయ్యపాళెం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి దశరథన్, నాయకులు చలపతినాయుడు, సుబ్రహ్మణ్యం, శివ రంగన్న తదితరులు ఉన్నారు.

అభివృద్ధి కొనసాగాలి



పిచ్చాటూరు, అక్టోబరు 6: గత 32 రోజులుగా సత్యవేడు నియోజక వర్గంలో కుంటుపడిన అభివృద్ధిని కొనసాగేలా చూడాలని పిచ్చాటూరులో ఆదివారం శ్రీవారి పాదుకలను మోస్తూ ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలసి పాదయాత్ర నిర్వహించారు. చెన్నై నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గొడుగులతో రథయాత్రగా వస్తున్న భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఎమ్మెల్యే ఆదిమూలం సస్పెన్షన్‌తో నియోజకవర్గంలో అనిశ్చితి నెలకొందన్నారు. ఈ విషయాన్ని తిరుమలకు వచ్చిన సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు.

వృత్తి విద్యా కోర్సులపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 6: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు సమగ్ర శిక్ష, స్కిల్ డెవలప్‌మెంట్ టైమ్స్ సెంటర్ ఫర్ లెర్నింగ్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులపై ఆదివారం అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఒకేషనల్ ఐటీ ట్రైనర్ పార్వతమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు వల్ల వర్కింగ్ స్కిల్స్ పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య పాల్గొన్నారు.

పర్యాటక రంగం వీడియోలకు గడుపు పెంపు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 6: జిల్లాలో పర్యాటకరంగం ప్రమోషన్ కోసం ఔత్సాహికులు పాల్గొని ఉత్తమ వీడియోలు/రీల్స్ తయారు చేసి పంపేందుకు అక్టోబరు 25వ తేది వరకు గడువు పొడిగించినట్లు కలెక్టరు వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నిమిషాల నిడివిగల అత్యుత్తమ వీడియోలు, రీల్స్ పంపిన వారికి మొదటి బహుమతి కింద రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50వేలు, మూడవ బహుమతిగా రూ.25వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

మూడేళ్లకే దెబ్బతిన్న కాంపాళెం తారు రోడ్డు


రోడ్డు మధ్యలో ఉన్న గుంతలు - బ్రిడ్జి చివరి భాగంలో ఏర్పడిన గుంత

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 6: మండలంలోని కాంపాళెం తారు రోడ్డు మూడేళ్లకే లేచి పోయింది. 2021లో రూ.1.09 కోట్లతో శ్రీకాళహస్తి - తడ రోడ్డు నుంచి రెండు కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మించారు. అయితే అప్పట్లోనే రోడ్డు నాసిరకంగా నిర్మించారని గ్రామస్తులు అభ్యంతరాలు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డులో రెండు మూడు చోట్ల తారు లేచిపోయి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. బ్రిడ్జి నిర్మించిన చోట తారు రోడ్డు లోతట్టుగా ఉండటం నీరు వెలుపలికి వెళ్లే అవకాశం లేకపోవడంతో తారు లేచిపోయి పెద్ద గుంత ఏర్పడింది. మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరినప్పటికీ పట్టించుకోలేదని ప్రజలు తెలిపారు.

టీడీపీలో చక్రాల ఉష చేరిక అవాస్తవం


వైసీపీకి అనుకూలంగా ఉష ఉన్న ఫొటోలను చూపుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 6: వైసీపీ గెలుపుకోసం చురుగ్గా పనిచేసిన చక్రాల ఉష తెలుగుదేశంలో చేరినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, పలువురు తెలుగు మహిళలు తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... ఆ పార్టీ నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడారు. సామాన్య మహిళగా ఉన్న చక్రాల ఉషను బొజ్జల కుటుంబం రాజకీయంగా ప్రోత్సహించి తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలి స్థాయికి తీసుకొచ్చిందన్నారు. అయితే ఎన్నికల సమయంలో ఆమె వైసీపీ కండువా కప్పుకుని ఆ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయడమే కాకుండా బొజ్జల కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆమె టీడీపీలో చేరినట్లుగా వైసీపీ మైండ్‌గేమ్ రాజకీయాలకు తెరతీయడం సిగ్గుచేటన్నారు. మంత్రి లోకేశ్‌ను అందరితోపాటు ప్రజాదర్బార్‌లో కలిసిన ఉష ఆ ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి టీడీపీలో చేరిపోయినట్లు ప్రచారం చేసుకోవడం తగదన్నారు. టీడీపీ ఓటమి కోసం పనిచేసిన వారిని దూరం పెట్టాలని యువనేత లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాసరం రమేష్, బాలాజీ, శ్రీనివాసరెడ్డి, తెలుగు మహిళలు సుమతి, మల్లీశ్వరి, రేణుకమ్మ తదితరులు పాల్గొన్నారు.